క్లుప్తంగా

బాధితునికి ఎమ్మెల్యే పరామర్శ



సత్యనారాయణను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

రొద్దం: మండల పరిధిలోని నారనాగేపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గొల్ల సత్యనారాయణ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. వైద్యం తర్వాత ప్రస్తుతం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శంకర నారాయణ సోమవారం బాధితుడి ఇంటికెళ్లి పరామర్శించారు.

రేపు గోరంట్లలో ఎమ్మెల్యే పర్యటన

గోరంట్ల: ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ బుధవారం గోరంట్ల మండలంలో పర్యటిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప ఒక ప్రకటనలో తెలిపారు. రెడ్డిచెరువుపల్లి గ్రామ పంచాయతీలోని గుత్తివారిపల్లి, రెడ్డిచెరువుపల్లి గ్రామాల్లో నూతనంగా రూ.78 లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన వ్యవసాయ గిడ్డంగులకు ఎమ్మెల్యే భూమి పూజ చేసి పనులు ప్రారంభిస్తారన్నారు. అలాగే కాలేకుంటపల్లిలో రూ.10 లక్షల టీటీడీ నిధులతో నిర్మించిన భజన మండలి భవనాన్ని ఆయన ప్రారంభిస్తారని చెప్పారు. మండల ప్రజా ప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

క్రీడా దుస్తుల పంపిణీ



క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

రొద్దం: అండర్–14, 17 విభాగంలో సాఫ్ట్ బాల్, బేస్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన నారనాగేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం క్రీడా దుస్తులు అందజేశారు. రొద్దం గ్రామానికి చెందిన ఈడిగ నాగభూషణప్ప ఆధ్వర్యంలో ఎస్‌ఐ వలీబాషా చేతులమీదుగా క్రీడా దుస్తులు, బూట్లను పంపిణీ చేశారు . కార్యక్రమంలో పీఈటీ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

రొళ్ల: కర్ణాటక మద్యం విక్రయిస్తున్న రామచంద్రప్ప అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ మధురామచంద్రుడు తెలిపారు. ఆయన వివరాలమేరకు... రొళ్ల మండలం రత్నగిరి గ్రామం కాకి ప్రధాన రోడ్డులో నివాసం ఉంటున్న రామచంద్రప్ప అక్రమంగా కర్ణాటక మద్యం తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. ఇందులో భాగంగానే ఆదివారం అతని వద్ద నుంచి 50 (90 ఎంఎల్) మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. రామచంద్రప్పపై కేసు నమోదు చేశామన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం



సీఐగా బాధ్యతలు చేపడుతున్న రియాజ్ అహమ్మద్

హిందూపురం అర్బన్: పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణకు పెద్ద పీట వేస్తామని రెండో పట్టణ సీఐగా ఆదివారం బాధ్యతలు చేపట్టిన సీఐ రియాజ్ అహమ్మద్ తెలిపారు. మట్కా , గ్యాంబ్లింగ్, బెట్టింగ్‌పై నిఘా ఉంచుతామన్నారు. ట్రాఫిక్‌పై దృష్టి సారించడంతో పాటు రోడ్లపై నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆయన మర్యాద పూర్వకంగా డీఎస్పీ కంజాక్షన్‌ను కలిశారు.

దొంగ కాదు.. బుద్ధి మాంద్యుడు !



పోలీసుల అదుపులో ఉన్న ప్రభుదేవ

పావగడ: స్థానిక ఎస్ఎస్‌కే అతిథి గృహం వద్ద మొబైల్ ఫోన్‌ను చోరీ చేసిన ప్రభుదేవ అనే వ్యక్తిని స్థానికులు ఆదివారం పోలీసులకు అప్పగించారు. అయితే అతను దొంగ కాదని బుద్ధి మాంద్యుడని, ఎస్ఎస్‌కే అతిథి గృహం వద్ద అనుమానాస్పదస్థితిలో తిరుగుతున్న ప్రభుదేవను దొంగగా భావించి సెక్యూరిటీ గార్డులు పట్టుకున్నారని పోలీసులు తెలిపారు. అయితే నాగలమడక, భూపూరు, వెంకటాపురం గ్రామాలకు చెందిన వారితో కలసి బస్టాండ్‌లో సమావేశమై మొబైల్ దొంగతనాలకు పాల్పడేవారమని ప్రభుదేవ తమకు చెప్పాడని సెక్యూరిటీ గార్డులు చెబుతున్నారు.



హిందూపురంలో బాణాసంచా వెలుగులు



హిందూపురం: ఓ దుకాణం వద్ద టపాసులు కాలుస్తున్న దృశ్యం



హిందూపురం: దీపాలు పెడుతున్న మహిళలు

సందడిగా దీపావళి

సాక్షిబృందం: దీపావళి పండుగను ప్రజలు అత్యంత ఘనంగా జరుపుకున్నారు. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లోని ఆలయాల్లో ఆది, సోమవారాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన దీపాలతో ఇళ్లన్నీ వెలిగిపోయాయి. గృహాలు, దుకాణ సముదాయాల్లో మహాలక్ష్మీదేవి ప్రతిమలు, కలశలను కొలువుదీర్చి పూజలు నిర్వహించారు. చిన్నా, పెద్దా అందరూ టపాసులు కాలుస్తూ సందడి చేశారు.



పెనుకొండలో దీపావళి సందడి ఇలా..



పరిగిలో దీపావళి సందర్భంగా టపాసులు కాలుస్తున్న దృశ్యం



హిందూపురం: చిచ్చుబుడ్లు కాలుస్తున్న యువత



హిందూపురం: ఓ షాపులో లక్ష్మీదేవి పూజ నిర్వహించిన దృశ్యం



అమరాపురంలో : టపాసులు పేలుస్తున్న దృశ్యం

సాదరుల సంక్షేమానికి కృషి

• ఏపీ స్టేట్ సెంట్రల్ కమిటీ ఎంపిక



హిందూ సాదర కుల సంఘం నూతన కమిటీ సభ్యులను సన్మానించిన దృశ్యం

పరిగి: హిందూ సాదర కుల సంఘం అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తామని ఏపీ సాదర కుల సంఘం సభ్యులు తెలిపారు. హిందూ సాదర ఏపీ రాష్ట్ర సెంట్రల్ కమిటీ సభ్యులను మండలంలోని కొడిగెనహళ్లిలో సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుడ్డిగురికి రంగారెడ్డి, ఉపాధ్యక్షుడిగా బీచిగానిపల్లి దయానంద్, కోశాధికారిగా సోమందేపల్లి లక్ష్మీనారాయణ, కార్యదర్శిగా రొళ్ల నాగేంద్రతో పాటూ మరో 15 మందిని డైరెక్టర్లుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన కమిటీ అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సాదర కులాన్ని బీసీ కుల జాబితాలో చేర్చారన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం బీసీ వర్గంలో చేర్చకపోవడంతో ప్రస్తుతం విద్యార్థులంతా తమ కుల సర్టిఫికెట్లను ఓబీసీ కింద పొందుతున్నారని చెప్పారు. ఫలితంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటూ విద్యారంగంలో ఎన్నో అవకాశాలను కోల్పోతున్నట్లు వివరించారు. జిల్లాలోని పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గాలలో మాత్రమే సాదర కులస్తులు ఉన్నారని, మూడు నియోజకవర్గాల నుంచి కమిటీని ఎంపిక చేసుకున్నామన్నారు. అలాగే రాష్ట్రంలో సాదర కుల సంఘానికి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరతామన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన కమిటీ సభ్యులను సన్మానించారు.

వైఎస్సార్‌సీపీలోకి పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శంకరనారాయణ, ఎంపీ గోరంట్ల మాధవ్, సమన్వయకర్త దీపిక

హిందూపురం: పట్టణంలోని ముక్కిడిపేట, ఆబాద్ పేటకు చెందిన పలు కుటుంబాలు పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీలో చేరాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు షాజహాన్‌బేగ్, రఫిక్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎంపీ గోరంట్ల మాధవ్, హిందూపురం సమన్వయకర్త టీఎన్.దీపిక వారికి కండువాలు వేసి సాదరంగా పార్టీ ఆహ్వానించారు. ఈ సందర్భంగా సమన్వయకర్త దీపిక మాట్లాడుతూ ఇంతవరకూ ఏ ప్రభుత్వం చేయని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు మంచి చేస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపుతోనే ప్రజా సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ప్రజలకు వివరించాలన్నారు.

అవినీతికి బ్రాండ్ అంబాసిడర్ ‘గుండుమల’



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మడకశిర: నియోజకవర్గంలో అవినీతికి బ్రాండ్ అంబాసిడర్ టీడీపీ ఇన్‌చార్జ్ గుండుమల తిప్పేస్వామి అని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు. స్థానిక టీడీపీ నాయకులు తమ అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు దళిత ఎమ్మెల్యే తిప్పేస్వామిపై తప్పుడు ఆరోపణలు, దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. టీడీపీ నాయకులకు దమ్ము, ధైర్యం ఉంటే ఎమ్మెల్యే అవినీతిని ఆధారాలతో నిరూపించాలని సవాల్ విసిరారు. సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పుట్టకామప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ విక్రమ్, కౌన్సిలర్లు నాగేంద్ర, అంజన్, అన్సర్, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎన్ క్రిష్ణమూర్తి, ఫ్రక్రుద్దీన్ తదితరులు విలేకరులతో మాట్లాడారు.ఎమ్మెల్యేపై టీడీపీ నాయకులు సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు ఆరోపణలను వారు తీవ్రంగా ఖండించారు. అవినీతి పరులెవరో నియోజకవర్గ ప్రజలకు బాగా తెలుసన్నారు. కొండలు, గుట్టలను కరిగించి అక్రమంగా రూ.వేల కోట్లు సంపాదించిన చరిత్ర గుండుమల తిప్పేస్వామిదని విమర్శించారు. టీడీపీ నాయకులు గంజాయి సాగును కూడా ప్రోత్సహిస్తున్నారని ధ్వజమెత్తారు. గుడిబండ మండలం సీసీ గిరిలో టీడీపీ కార్యకర్త తోటలో గంజాయి చెట్లను కర్ణాటక పోలీసులు స్వాధీనం చేసుకోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఇప్పటికైనా టీడీపీ నాయకులు పద్ధతి మార్చుకోకపోతే తగిన బుద్ధి చెబుతామని వారు హెచ్చరించారు.

రొళ్ల: టీడీపీ కార్యకర్త అయిన మంజునాథ్ ఆ పార్టీ నాయకుల మెప్పు కోసం స్థాయి ఇష్టానుసారం మాట్లాడుతున్నాడని, స్థాయికి తగ్గట్లు మాట్లాడితే బాగుంటుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి హితవు పలికారు. ఆయన జేసీఎస్ మండల కన్వీనర్ నాగేంద్ర, సింగిల్ విండో అధ్యక్షుడు మోతీరాంనాయక్, మడకశిర మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీనివాస్‌తో కలసి విలేకరులతో మాట్లాడారు. గుడిబండ మండలం సీసీ గిరికి మంజునాథ్ అనే వ్యక్తి ఎమ్మెల్యే తిప్పేస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తప్పుబట్టారు. ఎస్సీకి రిజర్వు అయిన నియోజకవర్గంలో గుండుమల తిప్పేస్వామి దళితులను తన చెప్పు చేతల్లో పెట్టుకుని కరివేపాకులాగా వాడుకుంటున్నారని విమర్శించారు.

అమరాపురం: సీసీ గిరి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు యంజేరప్ప గంజాయిని గుట్టుచప్పుడు కాకుండా ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నాడని అతని పై పోలీసు అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని గుడిబండ సింగిల్ విండో అధ్యక్షుడు చంద్రప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో నియోజకవర్గం అభివృద్ధి చెందుతోందన్నారు. అయితే కొందరు టీడీపీ నాయకులు అసాంఘి కార్యకలాపాలకు తెరలేపి అలజడి సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. మండల వైఎస్సార్ సీపీ పంచాయతీ విభాగపు అధ్యక్షుడు టి.సిద్దప్ప ఎస్సీసెల్ అధ్యక్షుడు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్ర విజయవంతం చేయండి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపికా

లేపాక్షి: హిందూపురం నియోజకవర్గ కేంద్రంలో బుధవారం (15వ తేదీ) నిర్వహించనున్న సామాజిక సాధికరత బస్సు యాత్రను జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులతో పాటు ప్రజలకు హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం స్థానిక వ్యవసాయ గోదాములో మండలస్థాయి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 15న హిందూపురం సామాజిక సాధికరత బస్సు యాత్ర స్థానిక అంబేడ్కర్ సర్కిల్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. లేపాక్షి మండలం నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీలు అంజినరెడ్డి, నీలావతి, సర్పంచ్ ఆదినారాయణ, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ప్రభాకర్‌తో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ‘పురం’ క్రీడాకారుల ప్రతిభ



కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచిన పురం కరాటే విద్యార్థులు

హిందూపురం టౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర అంతర్ జిల్లాల రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో హిందూపురం పట్టణానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మన్యం జిల్లా పార్వతీపురంలో 67వ పాఠశాలల కరాటే పోటీలు వివిధ విభాగాల్లో నిర్వహించారు. అండర్–17 కేటగిరిలో 60 కేజీల విభాగంలో పాంచజన్య పాఠశాల 9వ తరగతి విద్యార్థి టీ.నేహా తృతీయ స్థానంలో, అండర్–17లో 45 కేజీల విభాగంలో బాలయేసు కళాశాల విద్యార్థి రియాజ్ ద్వితీయ స్థానంలో, అండర్–17లో 50 కేజీల విభాగంలో ముద్దిరెడ్డిపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి సయ్యద్ ద్వితీయ స్థానంలో నిలిచారు. అండర్–14లో 60 కేజీల విభాగంలో ఫైట్ కేటగిరిలో పాంచజన్య పాఠశాల 7వ తరగతి విద్యార్థి ధనుంజయ తృతీయ స్థానంలో, అండర్–17లో 48 కేజీల విభాగంలో ఎల్ఆర్‌జీ నాయుడు జూనియర్ కళాశాల విద్యార్థి గ్రీష్మ తృతీయ స్థానంలో, అండర్–14లో 30 కేజీల విభాగంలో మేళాపురం పాఠశాల విద్యార్థిని లిఖిత తృతయ స్థానంలో, అండర్–19లో 58 కేజీల విభాగంలో నారాయణ కళాశాల విద్యార్థి హరీష్ తృతీయ స్థానంలో, అండర్–17లో 54 కేజీల విభాగంలో నారాయణ కళాశాల విద్యార్థి లోకేష్ ద్వితీయ స్థానంలో నిలిచి సత్తాచాటారు. వీరికి మెడల్స్‌ను అందజేసి సత్కరించారు.


పరుగు పందెంలో ప్రతిభ



ట్రోఫీ అందుకుంటున్న విజేతలు

పావగడ: తుమకూరు సిద్దగంగ మఠంలో ఆదివారం నిర్వహించిన తుమకూరు విశ్వ విద్యాలయం అంతర్ కళాశాలల పురుషుల విభాగం పోటీల్లో పరుగు పందెంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడాకారులు ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్, పీఈటీ హనుమంతరాయప్ప, అధ్యాపకులు హర్షం తెలిపారు.

టీడీ పల్లిలో తాగునీటి సమస్యకు చెక్



బోరుబావిలో నీళ్లు సమృద్ధిగా పడిన దృశ్యం

రొళ్ల: మండల పరిధిలోని టీడీ పల్లిలో తాగునీటి సమస్యకు చెక్ పడింది. గ్రామంలో వాటర్ స్కీమ్ పథకం కింద రెండు బోరు బావులు ఉన్నాయి. అందులో ఒక బోరు పూర్తిగా ఎండి పోయింది. మిగిలిన ఒక బోరుబావిలో నీళ్లు వస్తున్నప్పటికీ గ్రామానికి ఏమాత్రం సరిపోయేవి కాదు. స్థానికులు సర్పంచ్ సదాశివప్పకు సమస్యను వివరించగా జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు సహకారంతో ఎమ్మెల్యే తిప్పేస్వామి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే (జేజీఎం) జల్ జీవన్ మిషన్ నిధులతో కొత్తగా బోరుబావి తవ్వడానికి అనుమతి ఇప్పించారు. సోమవారం రాత్రి బోరుబావి తవ్వించగా దాదాపు 3 ఇంచుల నీళ్లు పడ్డాయి. ఈ సందర్భంగా నాయకులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

లేపాక్షి: స్థానిక లేపాక్షి శాఖ గ్రంథాలయంలో నేటి నుంచి ఈనెల 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతాయని గ్రంథాలయాధికారి జయసింహరాజు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ముఖ్యులను స్మరించుకోవడం, 17న కవి సమ్మేళనం, సెమినార్లు, రచయితల సందేశాలు, 18న పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ, క్రీడల పోటీలు, 19న మహిళా సాధికారితపై చర్చ, 20న డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన, వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

హిందూపురం టౌన్: స్థానిక శాఖా గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి శ్రీధర్ తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, మాదక ద్రవ్యాలపై అవగాహన, 16న గ్రంథాలయ ముఖ్యులను స్మరించు కోవడం, 17న కవి సమ్మేళనం నిర్వహిస్తామన్నారు. అలాగే 18న విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు, 19న దిశా చట్టం, మహిళా సాధికారతపై చర్చ, 20న డిజిటల్ గ్రంథాలపై అవగాహన, జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి



జ్యోతులతో ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

గుడిబండ: మండల కేంద్రంలో బోయ కులస్తుల ఆధ్వర్యంలో ఆదివారం వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి చిత్రపటాన్ని గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. తొలుత మహిళలు బియ్యం పిండితో చేసిన జ్యోతులను మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి రవీంద్ర స్కూల్ సమీపాన కొలువు దీర్చిన చిత్రపటం చుట్టూ ప్రదక్షిణ చేశారు. అనంతరం జ్యోతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. హాజరైన భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

16న ‘వై ఏపీ నీడ్స్ జగన్’

రొళ్ల: మండల కేంద్రంలోని సచివాలయం–2 ఆవరణలో ఈనెల 16న వై ఏపీ నీడ్స్ జగన్ (ఏపీకి జగనే సీఎం ఎందుకు కావాలంటే) అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సోమవారం ఎంపీడీఓ ఆజాద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తిప్పేస్వామి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సంక్షేమం,అభివృద్ధిని వివరించాలి



సర్వే సామగ్రి పంపిణీ చేస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తెచ్చేలా గ్రామస్థాయిలో సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మండల జేసీఎస్ కన్వీనర్ నాగేంద్రయాదవ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామిరెడ్డి తెలిపారు. సోమవారం వివిధ గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం ద్వారా ఇంటింటా నిర్వహించే సర్వే సామగ్రిని అందించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ చోరీ

మడకశిరరూరల్: మండల పరిధిలోని సిద్దగిరి గ్రామ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి నాలుగు వ్యవసాయ బోర్లకు అమర్చిన కేబుల్‌ను కట్ చేసుకెళ్లారని బాధిత రైతులు వాపోయారు. ఒకే రోజు నాలుగు బోర్లకు సంబంధించిన వైరును చేసుకెళ్లారని, దీంతో సాగు చేసిన పంటలకు నీరు పెట్టేందుకు ఇబ్బంది పడుతున్నామని రైతులు ఓబులేసు, నరసింహారెడ్డి, హరినాథ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేస్తామన్నారు.

గుడికట్ల సంబరాల పోస్టర్ల విడుదల



పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

సోమందేపల్లి: అనంతపురంలో ఈ నెల 19న జరగనున్న గుడికట్ల సంబరాలను విజయవంతం చేయాలని కురుబ సంఘం జిల్లా అధ్యక్షుడు సామకోటి ఆదినారాయణ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రమైన సోమందేపల్లిలో అందుకు సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు. నాయకులు శివానంద, నారాయణ, శ్రీనివాసులు, మారుతి, అంజి, శివ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి



మహేశ్వరరెడ్డి (ఫైల్)

పెనుకొండ రూరల్: మండలంలోని కొండంపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యరక్త మహేశ్వరరెడ్డి (42) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణ, గోపాల్‌రెడ్డి, అంజినాయక్, నారాయణరెడ్డి, తదితరులు మహేశ్వరరెడ్డి భౌతికకాయంపై పుష్ప గుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.